

తిరువీధుల్లో ఖాద్రీశుడు

ఘనంగా మధ్వనవమి వేడుకలు

కదిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం మధ్వనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారు సాయంత్రం హనుమంత వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సరిగ్గా నెల రోజుల ముందు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ అని ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ మధ్వ నవమి వేడుకలను నిర్వహిస్తామని అన్నారు. భక్తులు స్వామివారికి తిరువీధుల్లో కాయ, కర్పూరం సమర్పించారు.

బాలిక పై అత్యాచారం

రాయచూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మాన్వి తాలూకాలోని ఓ గ్రామంలో 8 ఏళ్ల బాలిక పై అదే గ్రామానికి చెందిన శివనగౌడ(36) అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకోగా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రైవేటు పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న బాలికను శివనగౌడ బడి నుంచి తీసుకెళ్లి అత్యాచారం చేసి తిరిగి వారి ఇంటి దగ్గర వదిలేశాడు. బాలికను గమనించిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు పరారు కాగా పోలీసులు గాలింపు చేపట్టారు.



● బగర్‌హుకుం భూముల హక్కులు సాకారమయ్యేదెన్నడో...!
● తిరస్కరణ దశలో 12.21లక్షల అర్జీలు
● అన్నదాతకు తప్పని ఆవేదన
● రుణాలు అందవు.. బాధలు తీరవు
● ఏ ప్రభుత్వం వచ్చినా మారని తీరు


ఎన్నాళ్లీ.. ఎదురుచూపు...!



బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా సాగు చేసుకుంటున్న బగర్‌హుకుం భూముల హక్కులు దక్కుతాయని ఎదురు చూస్తున్న అన్నదాతలకు షాక్ తప్పేలా లేదు. అక్రమ - సక్రమ పథకం కింద అందించిన 14.22 లక్షల అర్జీలకుగాను 90శాతం తిరస్కరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా అధికారులు 3,83,502 దరఖాస్తులను తిరస్కరించారు. తహసీల్దారులు జిల్లా అధికారులకు తిరస్కరణ ప్రస్తావన చేసిన అర్జీల సంఖ్య 8,37,944. ఇలా రెండూ కలిపితే మొత్తం 12లక్షలకుపైగానే ఉంది. తహసీల్దారుల హుకుంతో బగర్‌హుకు రైతులు భూరహితులయ్యే పరిస్థితి నెలకొంది.

రాష్ట్ర వ్యాప్తంగా బగర్‌హుకుం అర్జీలను త్వరితగతిన విభజించే ప్రక్రియ చేపట్టారు. అధికారిక సాగు చీటీలేని అన్నదాతల పరిస్థితి త్రిశంకుస్వర్గంలా మారేలా నెలకొంది. ఏడాదిలోగా పరిహారం కల్పించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో తరతరాలుగా ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న రైతుల్లో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశపడ్డారు. బగర్‌హుకుం అర్జీలను పరిష్కరించేందుకు ఏడాది అవకాశం కల్పించారు. నమూనా 50, 53, 57లలో సమర్పించిన అర్జీలలో చాలావరకు విభజించకనే తాలూకా స్థాయి బగర్‌హుకు సమితిల ముందు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో అర్హత లేనివి కూడా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆక్రమణలు తొలగించడం సాధ్యం కావడం లేదు. సమితిలు అర్జీలను పరిష్కరించకపోవడాన్ని కోర్టు కూడా తీవ్రంగా పరిగణించింది.

అర్హులకు న్యాయం చేస్తాం: మంత్రి



పారదర్శక, అర్హులైన వారికి న్యాయం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ ఒక ప్రకటలో తెలిపారు. అర్జీలను విభజించడంలో తలెత్తిన జాప్యం అవినీతికి కారణమైందనే ఆరోపణలు ఉన్నాయని, రెండు మూడు దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా అలాగే ఉండడంతో ప్రభుత్వ ఆశయాలకు భంగం కలుగుతోంది. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న అర్జీలలో పొరపాట్లు ఉంటే సహాయ కమిషనర్‌కు సూచించాలని మంత్రి తెలిపారు. ఒకవేళ తనకు అర్జీ వచ్చినా కూడా వారికే బాధ్యత అప్పగిస్తామన్నారు.

కమిటీలకు విలువేదీ...?: ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆగ్రహం



బగర్‌హుకుం సక్రమం చేసేందుకు అర్జీలను ఎమ్మెల్యేల అధ్యక్షతన అక్రమ-సక్రమ కమిటీ పరిశీలిస్తోంది. వారం రోజులు ముందే నోటీసు ఇచ్చి సమితి ముందు హాజరై పేర్కొన్న దాఖలాలను సమర్పించే అవకాశం ఉంది. రైతులు చెప్పిన వివరాలతో దాఖలాలు ఉంటే మంజూరు అవకాశం ఉంది లేదంటే తిరస్కరించవచ్చు లేనిపక్షంలో మరింత సమాచారం సమర్పించాలని సూచించి గడువు ఇచ్చే అవకాశం ఉంది. మూడు రకాల నమూనాలలో అర్జీ సమర్పించి అవకాశం ఉండగా, ఒకసారి తిరస్కరించబడితే సదరు రైతుకు అన్యాయం జరిగినా మళ్లీ అర్జీ సమర్పించే అవకాశం లేదు. అర్జీలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధ్యక్షతన సమితిలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇలా అర్హులైన అర్జీలు మాత్రమే మంజూరుకు సమితి ముందుకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు అర్జీదారుడి తరఫున అతడి అభిప్రాయంతో నిమిత్తం లేకుండా తహసీల్దారు స్థాయిలో అర్హ, అనర్హంగా నిర్ధారించి, అనర్హ అర్జీలను తిరస్కరించేలా జిల్లా అధికారికి సిఫారసు చేస్తారు. అయితే అర్జీలను సత్వరం పరిష్కరించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కమిటీలకు సరైన ప్రాధాన్యం ఇవ్వకుండా తహసీల్దారు, జిల్లా అధికారులకు ప్రాధాన్యం ఇవ్వడంతో స్థానిక ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కమిటీలకు ఉన్న అధికారాన్ని జిల్లా అధికారులకు కట్టబెట్టడాన్ని ఖండిస్తున్నట్టు బీజేపీకి చెందిన కార్కళ ఎమ్మెల్యే వి సునిల్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదివరకు ఎమ్మెల్యే కమిటీలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని తాజాగా జిల్లా అధికారులకు కట్టబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలాచోట్ల తహసీల్దార్లు ఆమోదం కంటే తిరస్కరణకే ఎక్కువ సిఫారసు చేస్తున్నారని దీంతో అర్హులైన రైతులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. తహసీల్దారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయరాదని కోరారు.

రెవెన్యూ చట్టం ఏం చెబుతోందంటే...

రెవెన్యూ చట్టం 1964 నియమం 108 ప్రకారం అధికార మార్పిడి చేసేందుకు జిల్లా అధికారికి అవకాశం ఉంది. అయితే తహసీల్దారు సిఫారసు చేసిన అనర్హ అర్జీలకు సంబంధించి గుడ్డిగా సరే అంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బెళగావి జిల్లాలో రైతులు దశాబ్దాలుగా బగర్‌హుకుం సాగు చేస్తున్నారు. తహసీల్దారు ,గోమాళ్ అని నమోదు చేసి తిరస్కరిస్తూ సిఫారసు చేశారు. జిల్లా అధికారి అధికారికంగా ఆమోదం తెలిపారు. దీంతో బాధిత రైతు విన్నపంతో స్థలాన్ని పరిశీలించగా గోమాళ కాదు సాగు భూమి అని ధ్రువపడింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో తహసీల్దారు పొరపాటు జరిగిందని మళ్లీ అర్జీని పునఃపరిశీలించాలన్నారు. గుండ్లుపేట తాలూకాలో ఇదే మాదిరి చోటు చేసుకుంది. అవగాహన కల్గిన రైతులు, సీనియర్ అధికారుల జోక్యంతో సమస్య కొంతమేరకు పరిష్కారమైంది. అర్జీలను వేగంగా పరిష్కారించాలనే నెపంతో తహసీల్దారులు, గ్రామపరిపాలనాధికారులు స్వయంగా సమీక్ష చేయకనే తమకు అనుకూలంగా తీర్మానం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా తహసీల్దారు చేసిన సిఫారసులను జిల్లాధికారి ఆమోదం చేస్తుంటారు. 1998 నుంచి 2022 వరకు అర్జీలు పరిష్కారానికి నోచుకోలేదు. సిద్దరామయ్య తొలి విడత పాలనలో 2017లో ఏడాది అవకాశం కల్పించగా తాజాగా మళ్లీ బగర్‌హుకుం భూములను పరిష్కరించేందుకు ఏడాది అవకాశం కల్పించారు. ఏ మేరకు సఫలం కానుందనేది వేచిచూడాలి.

10 నుంచి పోరాటం...

బగర్‌హుకుం సాగు అర్జీలను శరవేగంగా పరిష్కరించడం వెనుక ప్రభుత్వంపై భూమాఫియా ఒత్తిడి ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. నాలుగైదు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులను బలవంతంగా తరిమివేసే కుట్ర సాగుతోందని కేపీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు బసవరాజ్ ఆరోపించారు. అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం, ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఈనెల 10నుంచి బెంగళూరు ఫ్రీడం పార్కులో నిరవధిక ధర్నా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

శుభకార్యాలయం.!



● ప్రైవేట్ ఫంక్షన్లకు బీజేపీ కార్యాలయం ● మండిపడుతున్న కార్యకర్తలు ● జిల్లా అధ్యక్షుడికి పార్టీ అధిష్ఠానం నోటీస్



బీజేపీ కార్యాలయంలో పుట్టిన రోజు వేడుకలు (ఫైల్)

బళ్లారి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అది సాక్షాత్తు బీజేపీ జిల్లా కార్యాలయం..పార్టీ సమావేశాలు, కీలక నాయకుల సదస్సులు జరపాల్సిన ఈ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు శుభకార్యాలు జరపడం వివాదానికి కారణమయ్యింది. జిల్లా బీజేపీలో గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు మధ్య రగలిన అసంతృప్తి జ్వాలలు ఇంకా చల్లారలేదు. అంతలోనే పార్టీలో మరో వివాదం రేగడం కలకలం రేపుతోంది. పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించుకున్న బీజేపీ కార్యాలయాన్ని ఒక రోజు ఫంక్షన్ చేసుకునేందుకు జిల్లా అధ్యక్షుడు అనుమతించడంపై పార్టీలో సర్వత్రా చర్చ సాగుతోంది. ఇకపై తమ ఇంటి ఫంక్షన్లకు కూడా పార్టీ కార్యాలయం వాడుకోవచ్చుకదా.? అని కొందరు కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. బళారి అటల్ బిహార్ వాజ్‌పే లే-ఔట్‌లో అన్ని హంగులతో బీజేపీ కార్యాలయం నిర్మించారు. రెండు రోజుల క్రితం అక్కడ ఒక ప్రైవేటు వ్యక్తి తన పుట్టినరోజు వేడుకలను గ్రాండ్‌గా చేసుకున్నారు. పార్టీ కార్యాలయాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడంపై కొందరు కార్యకర్తలు అధ్యక్షుడిపై భగ్గుమం టున్నారు. ఫంక్షన్ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొందరు కార్యకర్తలు పార్టీ రాష్ట్ర కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. పార్టీ అధిష్ఠాన వర్గం జిల్లా పార్టీ అధ్యక్షుడు మోకా అనిల్ నాయుడుకు షోకాజ్ నోటీస్ ఇచ్చిందని సమాచారం. అయితే బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోకా అనిల్ నాయుడును ప్రశ్నించగా పార్టీ కార్యాలయం పక్కన ఉండే వారి ఇంట్లో ఫంక్షన్ జరుగుతోందని, వారి ఇల్లు చిన్నది, పైగా మరమ్మతులో ఉందన్నారు. ఆఫీసును వాడుకుంటామని అడగ్గా మానవతా దృక్పథంతో అనుమతించామన్నారు. ఇందులో ఎటువంటి దురుద్దేశం లేదని, కావాలనే కొందరు అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు.

బ్యాంకును మోసగించిన కేసులో

మాజీ మంత్రి దోషి

● ప్రజాప్రతినిధుల న్యాయస్థానం తీర్పు



మాజీ మంత్రి కృష్ణయ్య శెట్టి

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుంచి రుణం తీసుకుని మోసం చేసిన కేసులో మాజీ మంత్రి కృష్ణయ్య శెట్టిని దోషిగా పేర్కొంటూ ప్రజాప్రతినిధుల న్యాయస్థానం గురువారం తీర్పు ప్రకటించింది. కృష్ణయ్యశెట్టి సహా నలుగురు నిందితులను దోషులుగా కోర్టు తీర్పులో పేర్కొంది. కృష్ణయ్యశెట్టి, ఎంటీవీ రెడ్డి, మునిరాజు, శ్రీనివాస్ దోషులుగా పేర్కొం టూ ఆదేశాలు జారీ చేసింది. శిక్షా ప్రమాణం ఇంకా నిర్ధారించలేదు. 2013లో ప్రైవేట్ బ్యాంకుకు వీరంతా కోట్లాది రూపాయల మోసానికి పాల్పడ్డారు. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేసింది. నకిలీ రికార్డులతో రూ.7కోట్లకుపైగా కృష్ణయ్యశెట్టి రుణంగా పొందారు. ఇందులో రూ.3.53 కోట్ల రుణాన్ని తిరిగి చెల్లించలేదని సీసీఐ ఆరోపించింది. మాలూరు ఎమ్మెల్యేగా, బీజేపీ పాలనలో మంత్రిగా కృష్ణయ్యశెట్టి వివిధ హోదాల్లో వ్యవహరించారు.

పాఠశాల బస్సులపై రవాణా అధికారుల కొరడా..!

● ఫిట్‌నెస్ లేని ఓ స్కూల్ బస్సులు సీజ్ ● యాజమాన్యం నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం



సీజ్ చేసిన పాఠశాల బస్సులు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. గురువారం ఆర్టీఓ అధికారి గిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పలు పాఠశాలల బస్సులను స్వాధీనం చేసుకున్నారు. బళ్ళారి నగర శివారు ప్రాంతమైన అల్లిపురంలో ప్రముఖ విద్యాసంస్థకు చెందిన బస్సులను తనిఖీ నిర్వహించారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత స్కూలు బస్సులు విద్యార్థులను ఎక్కించకుని వస్తున్న సమయంలో దారి మధ్యలో బస్సులు ఆపి తనిఖీలు చేశారు. అందులో ఎనిమిది బస్సులకు సంబంధించి ఏ ఒక్క బస్సుకు ఫిట్‌నెస్, ట్యాక్స్, ఇన్సురెన్స్ లేకుండా నడుపుతున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. దీంతో విద్యార్థులు ఉన్న ఎనిమిది బస్సులను నేరుగా ఆర్టీఓ కార్యాలయానికి తరలించారు. ఒకే నెంబర్‌తో రెండు బస్సులు నడుపుతున్న విషయాన్ని కూడా గుర్తించారు. విద్యార్థుల హితదృష్ట్యా విద్యార్థులతో కూడిన ఆరు బస్సులు వదిలివేసి శుక్రవారం తిరిగి ఆర్టీవో కార్యాలయానికి తీసుకురావాలని పాఠశాల యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఒకే నెంబరులో ఉన్న రెండు బస్సులను మాత్రం ఆర్టీవో కార్యాలయంలో సీజ్ చేశారు. రెండు బస్సుల్లో ఉన్న విద్యార్థుల తల్లితండ్రులకు విషయం తెలియజేడయంతో ఏమైందో... నని కంగారుగా ఆర్టీవో కార్యాలయానికి చేరుకుని పిల్లలను ఇంటికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీవో కార్యాలయానికి చేరుకున్న విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాల యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. ట్రాన్స్‌పోర్టు పేరుతో వేలాది రూపాయలు వసూలు చేసి. ఇలాంటి డొక్కు బస్సుల్లో విద్యార్థులను తీసుకెళితే ఎలా..? అంటూ నిలదీశారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదాలు జరిగితే మా పిల్లల భవిష్యత్ ఏమిటని...? యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నోటీసులు జారీ చేశాం: గిరి శ్రీనివాస్, ఆర్టీఓ



ప్రైవేట్ బస్సుల తనిఖీల్లో భాగంగా గురువారం సాయంత్రం ఓ పాఠశాలకు చెందిన బస్సులను తనిఖీ చేసిన సందర్భంగా విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి. 8 పాఠశాల వాహనాలకు సంబంధించి ఏ ఒక్కదానికి ఫిట్‌నెస్, ట్యాక్స్, ఇన్సూరెన్స్ లేవని గుర్తించాం. అందులో రెండు బస్సులు ఒకే నెంబరుతో నడుపుతున్న విషయం కనుగొన్నాం. పాఠశాలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలి.

ఏరో ఇండియాకు సర్వం సిద్ధం

● ఆకట్టుకున్న రిహార్సల్స్ ● 10 నుంచి ప్రదర్శనలు ● తరలిరానున్న సందర్శకులు



జాతీయ పతాకాలతో హెలికాప్టర్లు

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యలహంక ఎయిర్‌బేస్ ఏరో ఇండియా ప్రదర్శనకు సిద్ధమైంది. వైమానిక ప్రదర్శనల సందర్భంగా ఎయిర్‌పోర్ట్ చుట్టుపక్కల ట్రాఫిక్‌లో మార్పులు చేశారు. ప్రజలు సహకరించాలని ఇప్పటికే సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సూచించారు. కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు, బీబీఎంపీ, ఎన్‌హెచ్ఏఐ, నమ్మమెట్రో సంయుక్తంగా కార్యాచరణ కొనసాగిస్తున్నాయి. ఈనెల 9న రిహార్సల్స్ జరగనుండగా, 10నుంచి 14వరకు ప్రదర్శనలు జరగనున్నాయి. ప్రదర్శనలు వీక్షించేందుకు వీలుగా ఓల్వో ఏసీ బస్సులు కూడా సమకూరుస్తున్నారు. వాహనరద్దీని నియంత్రించేందుకు చోక్‌పాయింట్లను గుర్తించి పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.

ఆకట్టుకుంటున్న రిహార్సల్స్

వైమానిక ప్రదర్శనకు గురువారం జరిగిన రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. భారత్ రక్షక్ జాగ్వార్ టీమ్ చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సూర్యకిరణ్ విమానాలు, యుద్ధ హెలికాప్టర్లు, తేజ ఎల్‌సీహెచ్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల విద్యార్థులు సమీప ప్రాంతాల నుంచే వీక్షించారు.

అనధికార డ్రోన్‌లకు బ్రేక్

భద్రతా చర్యల్లో భాగంగా ఎయిర్‌బేస్‌లో అనధికార డ్రోన్‌లను ఎగురవేసేందుకు వీలు లేదని అధికారులు ప్రకటించారు. అత్యవసర సహాయ చర్యలకు మొబైల్ బృందాలను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలు సంస్థల సమన్వయంతో విడతలవారీగా కసరత్తు సాగిస్తున్నారు.

సందర్శకులకు సదుపాయాలు

ఏరో ఇండియా ప్రదర్శనకు విచ్చేసే ఎగ్జిబిటర్‌లు, సందర్శకులకు పలు సదుపాయాలు కల్పించనున్నారు. విశాలమైన స్థలంలో ఆసన వ్యవస్థ, విశ్రాంతి జోన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పార్కింగ్ ప్రదేశంలో ఇందిరా క్యాంటీన్ సహా అదనపు ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. సులభ సంచారం కోసం ఎక్కడికక్కడ సంకేతాలు ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులకోసం ప్రత్యేక ఏటీఎం కియోస్కులు కల్పించనున్నారు. పలు చోట్ల తాగునీటి కేంద్రాలు, మెడికల్ హెల్ప్ సెంటర్‌లు, అత్యవసర సహాయకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిరంతరం పనిచేసేలా సీసీటీవీ కెమెరాలు అమర్చారు. వీఐపీలు, సందర్శకులు, ఎగ్జిబిటర్స్‌లకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచారు. మరోవైపు చెత్తసంస్కరణకు వీలుగా రీసైకిల్ విధాన వ్యవస్థను ఏర్పాటు చేశారు. పర్యావరణ స్నేహి చర్యలు చేపట్టారు.



సూర్యకిరణ్ త్రివర్ణ విన్యాసం

డిజిటల్ విధానం

వైమానిక ప్రదర్శనకు ప్రత్యేకంగా ఏరో ఇండియా 2025 మొబైల్ అప్లికేషన్‌ను సిద్ధం చేశారు. ఏజెన్సీల మధ్య సమన్వయం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. రిహార్సల్స్ సహా ప్రదర్శన నిర్ణీత వేళల్లో సురక్షిత దృష్ట్యా యలహంక చుట్టుపక్కల ఎలాంటి ఎగురవేతకు అవకాశం లేకుండా ఆంక్షలు విధించారు.



భారత్ రక్షక్ జాగ్వార్ టీమ్ విన్యాసాలు



ఓ మహిళ సెల్ఫీ

నేటి నుంచి రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు


మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ క్రీడా పోటీలు శుక్రవారం నుంచి 9వతేదీ వరకు నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్(మా) అధ్యక్షుడు లక్ష్మీపతిరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల నుంచి 100 సంవత్సరాల వయసు వరకు మాస్టర్స్ అథ్లెటిక్ పరుగు పోటీలకు అర్హులని తెలిపారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పరుగు, స్పీడ్‌వాక్ పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాస్టర్స్ అథ్లెటిక్స్ పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలు, పేర్ల నమోదుకు సెల్ నంబరు 9502539888ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మా జిల్లా ప్రధాన కార్యదర్శి సికిందర్, కార్యదర్శి లోకనాథ్, సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్
- సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో స్వామి వారి 286వ జయంతి ఉత్సవాలపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 13 నుంచి 15 వరకు జరిగే జయంతి ఉత్సవాలకు హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరాఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాన్నారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు ఓబులేసు, రమాదేవి, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, పీఆర్ డీఈ మురళీధర్, ట్రస్టు సభ్యులు వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు రూ.50 లక్షల మంజూరు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని ఏపీ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ హయాంలో ఉత్సవాలకు ఒక్క పైసా నిధులు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులున్నా రూ.50 లక్షలు మంజూరు చేయడంపై సంతోకరమన్నారు. కార్యక్రమంలో రాజేష్ నాయక్, మనోహర్, శ్రీనివాస్ నాయక్, సురేష్ నాయక్, రవి నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ఛీత్కారం నుంచి.. సత్కారం దాకా..



లోను ఇచ్చేది లేదన్నారు

ఒకప్పుడు బ్యాంకు అధికారులు లోను ఇచ్చేది లేదంటూ ఖరాఖండిగా తేల్చిచెప్పారు. కాని ఇప్పుడు బ్యాంకు అధికారులే రుణం ఇస్తామని మా కాలనీ వైపు వస్తున్నారు. ఇదంతా మా సమష్టి కృషితోనే సాధ్య పడింది.

- గీతమ్మ, భీముడు మహిళా సంఘం సభ్యురాలు


సంఘాల్లో ఉన్న పొదుపు డబ్బుపై చర్చిస్తున్న మహిళలు

నాడు పైసా కోసం అడుక్కున్న మహిళలు.. నేడు సంఘాల్లో రూ.లక్షల్లో పొదుపు

- చిరు వ్యాపారాలు, కూలి పనులతో స్వావలంబన
- కాయకష్టంతో పిల్లల భవిష్యత్తుకు బాటలు
- ఆర్డీటీ సహకారంతో పక్కా గృహాల నిర్మాణం
- ఛీదరించుకున్నవారే ఆశ్చర్యపడేలా అభివృద్ధి

స్ఫూర్తిగా నిలుస్తున్న శ్రీరామ జోగుల కాలనీ మహిళలు

ఒకప్పుడు రూపాయి కోసం భిక్షమెత్తారు. పొట్ట చేతపట్టుకుని, ఊరూరూ తిరుగుతూ, ఎక్కడబడితే అక్కడే గుడారాలు వేసుకొని జీవన పోరాటం చేశారు. తమ పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వచ్చిన భిక్షమెత్తడాన్నే జీవన విధానంగా మార్చుకున్నారు. అయితే సమాజంలో మిగతా వారితో పాటు సమానంగా, గౌరవంగా బతకాలనే ఆలోచన వారి రాతను మార్చింది. రూపాయి అడిగితే ఛీకొట్టిన వారు సైతం ఆ మహిళల విజయాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నారు. పొదుపు సంఘాల ద్వారా జీవన గమనంలో సాధికారత సాధిస్తున్న వారే కంబదూరులో పాత పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న శ్రీరామ జోగుల కాలనీకి చెందిన మహిళలు. అడుక్కుతినే రోజుల నుంచి స్వయం ఉపాధి పొందుతున్న పరిస్థితుల దాకా వారి విజయయాత్ర ఇలా...

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం ఊరూరు తిరుగుతున్న సంచార జాతికి చెందిన కొందరు కంబదూరు శివారులో కొన్నేళ్ల కిందట గుడారాలు వేసుకున్నారు. ప్రతిరోజు ఉదయం పిల్లా పాపలతో కలిసి ఇల్లిల్లూ తిరుగుతూ భిక్షమెత్తేవారు. దొరికిన ఆహారంతో కడుపునింపుకునేవారు. ఈక్రమంలో ఎందరి నుంచో ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. తరచూ ఎదురవుతున్న అవమానాలు వారిలో సొంతంగా బతకాలనే ఆలోచనను తట్టి లేపాయి. ప్రభుత్వ సహకారంతో వెలుగు సంఘాలు, ఆర్డీటీ సంఘాలను ఏర్పాటు చేసుకొని అందులో పొదుపు చేసుకుంటూ, రుణాలు పొందుతూ చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్నారు. స్వయంకృషితో ఎదుగుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కాలనీలో సుమారు 550 మంది జనాభా ఉన్నారు. ఇందులో సుమారు 120 మంది దాకా మహిళలు ఉంటారు. 2007 లో భిక్షమెత్తుకుంటూ కంబదూరుకు వచ్చి శివారులో స్థిరపడ్డారు. ఆ ప్రాంతాన్ని ఒక కాలనీగా మార్చేసుకున్నారు. ఇక్కడ సుమారు 10 మహిళా సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 12 మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి బ్యాంకులు సుమారు రూ. 50 లక్షల దాకా రుణం ఇచ్చాయి.


శ్రీరామ జోగుల కాలనీ

సొంత వ్యాపారాలతో...

బ్యాంకుల ద్వారా పొందిన రుణాలతో ఆ మహిళలు సొంతంగా చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించారు. సబ్బులు, సర్ఫ్, ఫినాయిల్, బిందెలు, పేస్టులు, బ్రష్‌లు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. అలా వచ్చిన సంపాదనతో కొంత మొత్తం పొదుపు చేస్తూ రుణాలు తిరిగి చెల్లిస్తున్నారు. ఆదాయం పెరగడంతో పిల్లలను చదివించడం ప్రారంభించా రు. ఇలా వీరి సంతానంలో ఇప్పుడు ఐదో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న పిల్లలు కూడా ఉన్నారు. అలాగే సుమారు 30 నుంచి 40 మంది దాకా అమ్మాయిలకు పెళ్లిళ్లు కూడా చేశారు.

గుర్తింపు అడిగితే ఛీత్కారం

నిత్యం ఎక్కడో ఒకచోటకు వలస వెళ్తుంటారని, ఇలాంటి బిక్షగాళ్లకు బియ్యం కార్డులు కాని, ఎటువంటి గుర్తింపు కార్డులు కాని ఇచ్చేది లేదంటూ అప్పట్లో రెవెన్యూ అధికారులు వారిని ఛీ కొట్టారు. చివరికీ మహిళలంతా కలిసి 10 రోజుల పాటు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇక్కడే బతుక్కుంటామని, ఆసరా ఇవ్వాలని వేడుకున్నారు. మహిళల ఆందోళనకు అధికారులు దిగి వచ్చి, బియ్యం కార్డులను పంపిణీ చేశారు. ఈక్రమంలోనే వారు నలుగురితో పాటు సమాజంలో గౌరవంగా బతకాలనే దృఢ నిశ్చయంతో ముందుకు సాగారు.

రూ.50తో పొదుపు ప్రారంభం

కంబదూరుకు వచ్చిన తర్వాత సంచార జాతి మహిళలంతా మాట్లాడుకుని వెలుగు, ఆర్డీటీ సంస్థల ద్వారా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. తమ సంఘాలకు రాముడు, సీతమ్మ, భీముడు, ఆంజనేయస్వామి, కృష్ణుడు, సంతోష్, వేదావతి, దివ్యశ్రీ, లక్ష్మీ, భానుమతి పేర్లను పెట్టుకున్నారు. ఒక్కో మహిళ రూ.50తో పొదుపును ప్రారంభించారు. ఇలా కొన్నేళ్ల పాటు పొదుపు చేయగా అది నేటికి రూ. 10 లక్షల దాకా చేరింది. పొదుపు ద్వారా అధికారుల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. వెలుగు కార్యాలయంలో 10 మహిళా సంఘాలు, ఆర్డీటీ సంస్థలో 5 మహిళా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. మరో మూడు కొత్త సంఘాలను ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆ మహిళలు వెల్లడించారు.

సేద్యం పనులకు డిమాండ్

ఈ మహిళల్లో కొందరు చిరు వ్యాపారాలు చేసుకుంటుండగా, మరి కొందరు వ్యవసాయ కూలిపనులకు వెళ్తున్నారు. కష్టపడి పని చేస్తుండటంతో వీరికి డిమాండ్ బాగా పెరిగింది. 70 మంది మహిళలు ఓ గ్రూప్‌గా మారారు. వీరిలో మళ్లీ బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా విడిపోయారు. వీరందరికి ఒక గ్రూప్ లీడర్‌గా ఉంటారు. ఎక్కడికి ఏ పనికి వెళ్లాలన్నా అనుమతులు తీసుకునే వెళ్తుంటారు. ఇంతమంది మహిళలు ఒకే చోట పనికి వస్తుండటంతో కూలి పనులకు తీసుకెళ్లడానికి రైతులు ఈ కాలనీ వైపు పరుగులు తీస్తుంటారు. కంబదూరు మండలంలో పాటు కర్ణాటక ప్రాంతాల్లో ఉండే గ్రామాలకు కూడా వీరు కూలి పనులకు వెళ్తుంటారు. ఖాళీ సమయం అనేదే ఈ మహిళలకు ఉండదు. నిత్యం ఎక్కడో ఒక చోటకు కూలి పనులకు వెళ్తుంటారు. అలాగే ఉపాధి హామీ పనులకు కూడా వెళ్తుంటారు.

ఆదుకున్న ఆర్డీటీ

సొంతిళ్లు లేని మహిళలందరూ కలిసి ఆర్డీటీ ప్రతినిధులకు సమస్యను విన్నవించారు. స్పందించిన ఆర్డీటీ వారికి ఒకే సారి 35 పక్కా గృహాలను నిర్మించింది. దీంతో గుడిసెలతో ఉన్న ఆ ప్రాంతం అందమైన కాలనీగా రూపుదిద్దుకుంది. దానికి శ్రీరామ జోగుల కాలనీగా పేరు పెట్టుకున్నారు. కొండ ప్రాంతంలో ఈ కాలనీ ఉండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఇక్కడ ప్రభుత్వ నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించింది. వైద్య సిబ్బంది అక్కడికే వెళ్లి వైద్య సేవలపై అవగాహన కల్పిస్తుంటారు. ఇదంతా తమ ఇంటి మహిళల వల్లే సాధ్యమైందని పలువురు పురుషులు పేర్కొన్నారు.

రూపాయి కోసం భిక్షమెత్తాం



ఒకప్పుడు రూపాయి కోసం భిక్షమెత్తాం. తరచూ ఎదురైన ఛీత్కారాలతో ఆ రూపాయినే పొదుపుగా మార్చుకుని, కష్టపడి పని చేసుకుంటూ నలుగురిలో గౌరవంగా బతుకుతున్నాం. భిక్షమెత్తిన రోజుల్లో తిండికి అల్లాడిన మేము మా సంపాదనతో ఇప్పుడు ఇంటిల్లిపాది మూడు పూటల్లా తింటున్నాం. ఇదంతా మా సమష్టి కృషే. అధికారులు చేయూతనిస్తే ఇంకా ఆర్థికంగా ఎదుగుతాం.

- జయమ్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు

డబ్బుంటేనే గుర్తింపు



నేడు సమాజంలో డబ్బుంటేనే గౌరవం, గుర్తింపు. అందుకే అదర్శంగా అందరిలోను నిలవాలనే ఆలోచనతో ముందడుగు వేశాం. పైసా పైసా పొదుపు చేసి దాన్ని లక్షలుగా మార్చి మా బతుకులను మార్చుకున్నాం. ఇంకా ఆదర్శంగా నిలవాలన్నదే మా ప్రయత్నం. ఇదంతా మహిళలందరూ రాత్రింబవళ్లు కష్టపడిన విజయం. ఇదే స్ఫూర్తితో ముందుడుగు వేస్తాం. ప్రతి నెలా పొదుపు సూత్రాలు పాటిస్తున్నాం.

-శ్రీదేవి, భీముడు మహిళా సంఘం సభ్యురాలు

భిక్షమడిగితే విసుక్కునేవారు



భిక్షం అడిగితే అందరూ మమ్మల్ని విసుక్కునేవారు. అందుకే అడుక్కోవడాన్ని వదిలేశాం. స్వశక్తితో మేము ఓ కాలనీని ఏర్పాటు చేసుకుని, డబ్బులు సంపాదిస్తూ గౌరవ మర్యాదలు పొందుతున్నాం. సుమారు 70 మందికి పైబడి మా కాలనీలో మహిళలు జీవిస్తున్నారు. మహిళలందరికీ స్వయం ఉపాధి పథకాన్ని ఇక్కడే ఏర్పాటు చేస్తే ఆర్థికంగా ఇంకా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

- గంగమ్మ, సీతమ్మ మహిళా సంఘం సభ్యురాలు

రాత్రింబవళ్లు కష్టపడ్డాం



డబ్బు, పేరును సంపాదించడం కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డాం. ఆర్డీటీ, ప్రభుత్వ అధికారులు అందరూ కూడా మా కాలనీని ఆదర్శంగా తీసుకోవాలని సమావేశాల్లో చెబుతుండటం మాకు గర్వం కలిగిస్తోంది. అధికారులు మేము కష్టపడుతూ సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికి చెబుతుంటారు. ఇప్పుడు ఎక్కడ చూసినా మా కాలనీ గురించి చర్చించుకోవడం ఆనందం కలిగిస్తోంది.

- రామక్క, రాముడు మహిళా సంఘం

పంట నమోదును పూర్తి చేయండి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ


మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రబీ ఈ పంట నమోదు, ఈకేవైసీలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం ఏడీఏలు, ఏఓలతో సమావేశాన్ని నిర్వహించారు. కిసాన్ డ్రోన్‌లకు సంబంధించి కొత్త గ్రూపులను, పైలెట్లను గుర్తించడంతోపాటు శిక్షణ ఇవ్వాలన్నారు. మరో రెండు రోజుల్లో ప్రతి మండలానికి ఒక కిసాన్ డ్రోన్ రైతు గ్రూపును గుర్తించి, వారి వివరాలు పంపాలని ఆదేశించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఫిర్యాదులను పరిశీలించి, లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు పరిశీలించి, త్వరగా ఆన్‌లైన్ ద్వారా జిల్లా స్థాయికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు రవి, వెంకటరాముడు, యల్లప్ప, లక్ష్మానాయక్, టెక్నికల్ ఏఓలు వెంకట్‌కుమార్, రాకేష్, బాలూ నాయక్ పాల్గొన్నారు.

కోళ్ల మరణాలపై సమాచారం ఇవ్వండి

పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కోళ్లు అసాధారణంగా మరణిస్తే స్థానిక వెటర్నరీ డాక్టర్లకు వెంటనే సమాచారం అందించాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కోళ్ల అసాధారణ మరణాలు సంభవించాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా అధికారులను అప్రమత్తం చేసిందన్నారు. క్షేత్రస్థాయిలో కోళ్ల పరిస్థితిపై పరిశీలించామని, ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అసాధారణ మరణాలు లేవన్నారు. అవసరమైన చోట్ల నమూనాలు సేకరిస్తున్నామన్నారు. ఎక్కడైనా కోళ్లు చనిపోతే గుంత తీసి పూడ్చాలన్నారు.

15న మెగా జాబ్‌మేళా : ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 15న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని మధుగిరి రోడ్డు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణంలో ఫిబ్రవరి 15 ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు మెగా జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

విడపనకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పాల్తూరు ఎస్ఐ మురహరి తెలిపిన వివరాల మేరకు.. విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి(28) బుధవారం రాత్రి క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన బంధువులు వెంటనే బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. వన్నూరుస్వామికి మూడు ఎకరాలు సొంత పొలం ఉంది. దాంతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు చేసేవాడు. పంటల పెట్టుబడుల కోసం సుమారు రూ. 9లక్షలకు పైగా అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చుకోవాలని మదన పడుతుండేవాడని బంధువులు తెలిపారు. ఆ బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మృతుడికి భార్య సునిత, కొడుకు, కూతురు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుంతకల్లు మీదుగా రైళ్ల మళ్లింపు

గుంతకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా నాలుగు రైళ్లను గుంతకల్లు మీదుగా మళ్లించనున్నట్లు రైల్వే శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12642) రైలును ఈ నెల 10, 15, 17 తేదీల్లో విజయవాడ-గూడూరు సెక్షన్ ద్వారా కాకుండా బాలార్షా, ఖాజీపేట్, కాచిగూడ, డోన్, గుంతకల్లు, రేణిగుంట, చెన్నై మీదుగా మళ్లిస్తామని తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12644) రైలును ఈనెల 14న, హజ్రత్ నిజాముద్దీన్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12646) రైలును ఈనెల 11, 18 తేదీల్లోనూ, ఇండోర్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 22645) రైలును ఈనెల 10, 17 తేదీల్లోనూ బాలార్షా, ఖాజీపేట్, కాచిగూడ, డోన్, గుంతకల్లు, రేణిగుంట, చెన్నై మార్గంలో మళ్లిస్తామని తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా షోలాపూర్-తిరుపతి (వయా గుంతకల్లు) వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 01437)ను ఈ గురువారం (6న) విజయపుర-గదగ్-హోస్పేట-బళ్లారి-గుంతకల్లు మీదుగా మళ్లించారు. ఔరంగాబాద్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (నంబర్ 17621)ను 7వ తేదీ తాండూరు-ఆదోని మీదుగా కాకుండా వికారాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, డోన్, గుంతకల్లు మీదుగా మళ్లిస్తున్నామని తెలియజేశారు. గుంతకల్లు మీదుగా వెళ్లే కన్యాకుమారి-పూనే ఎక్స్‌ప్రెస్‌ను (నంబర్ 16382) ఈ నెల 6, 7, 8 తేదీలలో గంటన్నర ఆలస్యంగా నడుపుతున్నామని తెలిపారు.

పండ్లతోటల రైతులను ఆదుకోండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి నల్లప్పతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉద్యానవన కాంక్లేవ్ ఈ ప్రాంత ఉద్యానవన ఉత్పత్తుల ప్రచారానికి తోడ్పడాన్ని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. పండ్లతోటల రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు కంపెనీల ఒప్పందాలే పరిష్కారమన్నట్లు భావించడం తగదన్నారు. పండ్లతోటల రైతులతో విస్తృతంగా చర్చించి, వారిని ఆదుకోవడానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గత 15 సంవత్సరాల్లో వచ్చిన వరుస కరువుల వల్ల మెట్ట వ్యవసాయం తీవ్ర సంక్షోభానికి గురైందని తెలిపారు. సాగునీటి వనరుల అభివృద్ధికి తక్షణ ప్రత్యామ్నాయంగా మైక్రో ఇరిగేషన్ విధానం అమలులోకి వచ్చిందన్నారు. హార్టికల్చర్ కాంక్లేవ్ ద్వారా పండ్లతోటల రైతులను సమగ్రంగా ఆదుకోవడానికి బదులుగా కంపెనీలు, ఒప్పందాల చుట్టూ తిప్పారని అన్నారు. కార్యక్రమం ప్రచారానికే తప్ప రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉద్యాన రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

9న గిరిజన సమస్యలపై సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 9న ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10గంటలకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన గిరిజన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 6 నుంచి 12 శాతానికి పెంచాలని, మైదాన ప్రాంత గిరిజనులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు.

చీనీని పీడిస్తున్న పొలుసు

పురుగు దెబ్బకు రైతు కుదేలు.. కళ్ల ముందే ఎండుతున్న చీనీచెట్లు

ఖరీదైన మందులు వాడినా ఫలితం శూన్యం



తాడిమర్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సులువుగా పండించే పంట ప్రస్తుతం కష్టతరమైపోయింది. రెండు సార్లు పురుగుల మందులు స్ప్రే చేస్తే చేతికి వచ్చే చీనీ పంట.. నేడు 16 సార్లు మందులు కొట్టినా తెగులు అదుపులోకి రాలేదు. దీనికి తోడు ఇటీవల వచ్చిన పొలుసు పురుగు (హైరోకోకస్ సిట్రస్) తెగులు తీవ్రం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలుసు పురుగు అధికమై చీనీ చెట్ల బెరడు దెబ్బతిని ఎండిపోతున్నాయి. చీనీ కాయలకు మంగు ఏర్పడడంతో పంటను కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం జిల్లాలో గార్లదిన్నె మండలం, సత్యసాయి జిల్లాలో తాడిమర్రి మండలంలో అధికంగా చీనీ సాగవుతోంది. తెగుళ్లను అధికారులు కనీసం పరిశీలించిన పాపాన పోలేదు. పొలుసు పురుగు నివారణకు లీటరు రూ. 5వేల నుంచి 8వేల వరకు వెచ్చించి పిచికారి చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఈ తెగులు తీవ్రత మండలంలోని శివంపల్లి, తాడిమర్రి, కునుకుంట్ల గ్రామాల్లో అధికంగా ఉంది.

ఇలా మొదలవుతుంది..

పొలుసు తెగులుతో మొదటి దశలో చెట్లకు ఉన్న ఆకులు పసుపు వర్ణానికి మారడం మొదలవుతుంది. తరువాత కాండంపై ఉన్న బెరడు పగిలిపోవడం, చెట్టు నుంచి విపరీతంగా పూత, పిందె రావడంతోపాటు కాండంపై తెల్లటి పురుగు కనిపిస్తుంది. ఆ తరువాత దశలో చెట్టు పూర్తిగా ఎండిపోతుంది. దీనిని అదుపు చేయడానికి రైతులు మొదట కాండాన్ని గోనె సంచితో శుభ్రం చేసిన తరువాత మైలు తుత్తం, సున్నం కలిపి తయారు చేసుకున్న బోర్డో మిశ్రమాన్ని చెట్టు కొమ్మల వరకు పట్టిస్తున్నారు. ఇలా కూడా అదుపులోకి రానప్పుడు ఖరీదైన మందుల వైపు రైతులు పరుగులు పెడుతున్నారు. వయసు ఎక్కువగా ఉన్న చెట్లకే కాకుండా ఇటీవల నాటుకున్న వాటికి కూడా వ్యాప్తి చెందుతుండటంతో దిక్కుతోచని స్థితిలో రైతులు విలవిల లాడుతున్నారు. ఒక చెట్టు చనిపోయిందంటే.. ఏడాదికి సుమారు రూ.5వేలు నష్టం వాటిల్లినట్టే. ఇలా ఒక్కో రైతు పొలంలో కనీసం 40 నుంచి 50 చెట్లు చనిపోయాయి. కునుకుంట్లలో మరీ దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక పరిస్థితి సరిగా లేని రైతులు ఈ తెగులుకు మందులు కొనుగోలు చేయలేక బెంబేలెత్తిపోతున్నారు. ఆర్గానిక్ మందులను కూడా తెప్పించుకుని రెండు, మూడు రోజుల పాటు బెల్లంనీటిలో కలిపి చీనీచెట్లకు వదులుతున్నారు. దీనికి తోడు నల్లి ఉధృతి కూడా పెరుగుతోంది. పొలుసుపురుగుకు మందు కొట్టాలో.. నల్లికి కొట్టాలో తెలియక రైతులు గందరగోళంలో పడ్డారు.


చివరి దశ.. కాయలకు సోకిన మంగు

ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు



రోజుకొక మందుల కంపెనీ వాళ్లు వస్తారు.. ఆ మందు కొట్టు, ఈ మిశ్రమం పట్టించు, చెట్టు చుట్టూ గాడి తీసి అందులో మందు, నీరు పోయి అని చెబుతున్నారు. ఇవన్నీ కాదని ఆర్గానిక్ మందులు వాడితే మంచి ఫలితం వస్తుందని మరొకరు చెబుతారు. అన్నీ చేసినా చెట్లు పూర్తిస్థాయిలో కోలుకోలేదు. ఇప్పటికి రూ.1.50 లక్షలు అప్పులు చేసి మందులు కొట్టాను. అయినా ఫలితం లేదు.

-చలపతి, రైతు, తాడిమర్రి

అధికారులు దృష్టి సారించాలి



అందరూ వచ్చి పోతున్నారే కానీ అధికారులు మాత్రం రావడంలేదు. వారు తోటలను పరిశీలించి తగిన మందులను సిఫారసు చేస్తే బాగుంటుంది. ప్రభుత్వం కూడా మా పరిస్థితిని అర్థం చేసుకుని తక్కువ ధరలో మందులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ఆర్గానిక్ మందులు కూడా వదిలాం. అయినా ఫలితం కనిపించలేదు.

-ప్రభాకర్, రైతు, తాడిమర్రి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంయ్...

చార్లెస్ డికెన్స్ (జయంతి)




ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత చార్లెస్ డికెన్స్ 1812 ఫిబ్రవరి 7న ఇంగ్లండ్ దేశం హ్యాంప్‌షైర్‌లోని ల్యాండ్‌పోర్ట్‌లో జన్మించారు. సామాజిక కార్యకర్తగాను రాణించారు. విక్టోరియన్ సామ్రాజ్యం ఉచ్చస్థితిలో ఉన్నప్పుడు, పారిశ్రామిక విప్లవం అభివృద్ధి చెందుతున్న రోజుల్లో ఈయన మొదటితరం రచయిత. ఆసక్తికరమైన కథనంతో గుర్తుండిపోయే పాత్రలతోనూ ప్రపంచవ్యాప్తంగా జీవితకాలంలో మంచి అభిమానులను సంపాదించుకున్నారు. నేటికీ ఆయన నవలలు ఆదరణ పొందుతున్నాయి. 1870 జూన్ 9న కన్నుమూశారు.

వేటూరి ప్రభాకర శాస్త్రి (జయంతి)



వేటూరి ప్రభాకర శాస్త్రి 1888 ఫిబ్రవరి 7న కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెద్దకళ్ళేపల్లిలో జన్మించారు. తెలుగు కవి, భాషా పరిశోధకుడు, చరిత్రకారుడు, రచయిత, విమర్శకుడు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితుడు ఇలా పలు రంగాలలో రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. విమర్శనా వ్యాస రచనకు ఆద్యుడిగా పేరొందారు. చరిత్రలో లభ్యమవుతున్న మొట్టమొదటి తెలుగు పదము 'నాగబు' అని కనుగొన్నది ఆయనే. తంజావూరు ఆంధ్ర రాజుల చరిత్ర, శ్రీనాథ వైభవము, శ్రీనగర శ్రీనాథం, మను చరిత్ర, బసవ పురాణం వంటి వాటి గురించి సమగ్ర వివరాలతో ప్రచురించారు. 1950 ఆగస్టు 29న కన్నుమూశారు. తిరుపతిలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. కాగా తిరుమల తిరుపతి దేవస్థానం స్వయంగా 2007లో శ్రీమన్ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠం ఏర్పాటు చేసి ఆయన రచనలు, పరిశోధనలను ప్రచురించింది.

జీఎస్ శివరుద్రప్ప (జయంతి)



జీఎస్ఎస్‌గా సుపరిచితులైన ప్రముఖ కన్నడకవి గుగ్గరి శాంత వీరప్ప శివరుద్రప్ప 1926 ఫిబ్రవరి 7న శివమొగ్గ జిల్లా శికారిపుర తాలూకా ఈసూరు గ్రామంలో జన్మించారు. ఆయన కవి, విమర్శకులు, పరిశోధకులు, నాటకకర్త, ప్రాధ్యాపకులుగా రాణించారు. కువెంపు తర్వాత 'రాష్ట్రకవి' గౌరవం అందుకున్న ఘనత ఆయనది. సమన్వయ కవిగా పేరొందారు. సౌందర్య సమీక్ష రచనకు పీహెచ్‌డీ పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ, పంప, మాస్తి పురస్కారం, గౌరవ డాక్టరేట్ ఇతర పురస్కారాలు పొందారు. 2013 డిసెంబరు 23న కన్నుమూశారు.

దొడ్డరంగేగౌడ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత దొడ్డరంగేగౌడ 1946 ఫిబ్రవరి 7న తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా కురుబరహళ్ళిలో జన్మించారు. కన్నడ ప్రొఫెసర్‌గా రిటైరైనా కన్నడ సినీ రంగంలో పేరొందిన గేయ రచయిత, కవిగా రాణించి తనదైన గుర్తింపు పొందారు. 500కుపైగా పాటలు రాశారు. 10కిపైగా సినిమాలు, 80కుపైగా టీవీ సీరియల్స్‌కు మాటలు రాశారు. 'మనుజ కలం' పేరిట 80కుపైగా కృతులు రచించారు. కన్నడ ప్రగాఢగళ సామ్రాట్‌గా పేరొందారు. 2008 నుంచి 2014వరకు ఎమ్మెల్సీగాను వ్యవహరించారు. మూడుసార్లు ఉత్తమ గేయ రచయిత పురస్కారం, కర్ణాటక సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 2021లో హావేరిలో 86వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించారు.

కిదాంబి శ్రీకాంత్ (పుట్టినరోజు)



కిదాంబి శ్రీకాంత్ 1993 ఫిబ్రవరి 7న గుంటూరులో జన్మించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక ర్యాంకు కల్గిన భారత పురుషుల ఆటగాడు. శ్రీకాంత్ గోస్పోర్ట్స్ ఫౌండేషన్ బెంగళూరు ద్వారా 2012 నుంచి స్కాలర్‌షిప్ ద్వారా తోడ్పాటు పొందుతున్నాడు. 2014లో సూపర్ డాన్‌గా పిలవబడే లిన్‌డాన్‌ను ఓడించి చైనా ఓపెన్ సూపర్ సిరీస్ ప్రీమియర్‌లో స్వర్ణపతకం సాధించి సత్తా చాటుకున్నాడు. ఇతర పోటీలలో రజత, కాంస్యం అందుకున్నారు. 2022లో ఆయన జట్టు థామస్‌కప్ గెలుపొందారు.

9న కంటి వైద్యశిబిరం

ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని రోటరీ క్లబ్, బెంగుళూర్‌కు చెందిన శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహ కారంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ప్రసిడెంట్ జయ సింహ, కార్యదర్శి నాగభూషణ గురువారం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహిస్తామన్నారు.

ఉళవి జాతర సందడి

కాడెద్దులపై ఓ రైతు అభిమానం

బెంగళూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా ఉళవిలోని చన్నబసవేశ్వర జాతర బుధవారం ప్రారంభం కాగా ఈనెల 13న మహారథోత్సవం జరగనుంది. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాలనుంచి పెద్దసంఖ్యలో ఎడ్లను తీసుకురావడం సామాన్యం. సుమారు 2వేల ఎడ్లబండ్లు వచ్చే అవకాశం ఉందని వీటికోసం రూ.1.5కోట్లతో తాగునీటి వ్యవస్థ, పశువైద్యులు కల్పించినట్టు ఆలయ కమిటీ తెలిపింది. అధ్యక్షుడు సంజయ బసవరాజ్ కిత్తూరు మాట్లాడుతూ ఈసారి 4లక్షలమంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాగా జాతరలో పశువులకు మేత, నీరు సదుపాయం ఉందన్నారు. కాగా కలఘటగి తాలూకా మిశ్రికోటకు చెందిన ఈరప్ప అరళికట్టి అనే రైతు తన కాడెద్దులను చక్కగా అలంకరించారు. పశువుల వ్యాపారం చేయడంతోపాటు తన కాడెద్దులకు లక్షలాది రూపాయల విలువైన బంగారు కొమ్ములు, వెండి కడియాలు చేయించారు. తన కాడెద్దులకు రామ, లక్ష్మణ అని పేర్లు పెట్టారు. జాతరకు తొలుత బస్సులో వెళ్లే ఈరప్ప అక్కడి ఎడ్లబండ్లను చూసి తాను కూడా బండిలోనే రావాలని నిర్ణయించుకున్నాడు. ఇలా 18ఏళ్లుగా ఎడ్లబండితో జాతరకు వెళ్తున్నాడు. ప్రస్తుతం ఎద్దులకు అరకిలో వెండితో 4 కడియాలు, అలాగే కొమ్ములకు నాలుగు తొడుగులు చేయించారు. ముస్తాబు చేసిన ఎద్దులతో జాతరకు బయల్దేరగా గ్రామాల పొడవునా సాదర స్వాగతం లభించింది. ఉళవి చన్న బసవేశ్వర స్వామి చిత్రపటంతో ఊరేగగా సందడి నెలకొంది. గ్రామా లలో ఊరేగింపు సందర్భంగా కళాకారులు సందడి నెలకొంది. గుర్రపు విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి కాడెద్దులపై రైతుల అభిమానం అందరినీ ఆకట్టుకుంది.



కొమ్ములకు బంగారు తొడుగులు



ఉళవి చన్నబసవేశ్వరస్వామి చిత్రపటంతో ఊరేగింపు



వెండి కడియాలు కడుతూ...

గడిదం హుండీ ఆదాయం రూ.9 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది తదితరులు

బాగేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రముఖ క్షేత్రం భూనీళా సమేత వేంకటరమణస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.9.15 లక్షలుగా ఉందని తహసీల్దారు మనీషా ఎన్ పత్రి వెల్లడించారు. రెండో చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన బాగేపల్లి తాలూకాలోని గడిదం లక్ష్మీ వేంకట రమణస్వామి ఆలయానికి సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చిక్కబళ్ళాపుర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. తమకు తోచిన మొత్తాన్ని, మొక్కులను హుండీకి సమర్పిస్తారు. దేవదాయశాఖ పరిధిలోని ఈ ఆలయ హుండీ ఆదాయాన్ని ఏడాదిలో మూడుసార్లు లెక్కిస్తారు. బుధవారం తహసీల్దారు, ప్రధాన అర్చకుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. 9లక్షల 15వేల రూపాయల నగదును బ్యాంకు ఖాతాకు జమచేశారు. ఈ సందర్భంగా శిరస్తేదార్ బీఎం మంజునాథ్, ఆర్‌ఐ ఏ అనిల్‌కుమార్, ఈశ్వర్, ఎస్‌ఏ ప్రశాంత్, సునితా, శ్రీనాథశాస్త్రి, కార్యాలయ అధికారి కావ్య తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలను సమానంగా చూడాలి

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలబాలికలు అనే భేద భావాలు లేకుండా పిల్లలకు సమానంగా విద్య అందించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి మహ్మద్ రోషన్ షా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్‌లో పేరెంట్స్ మీటింగ్‌లో ఏర్పాటైన చట్టంపై అవగాహనలో భాగంగా న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. కొంతమంది తల్లిదండ్రులు విద్యవిషయంలో బాలబాలికల పట్ల భేదభావం చూపుతున్నారన్నారు. ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని వారికి చక్కటి మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంతటి ఆధునిక కాలంలోనూ ఇంకా బాల కార్మిక, బాల్యవివాహ ఘటనలు వెలుగు చూస్తున్నా యంటే ఇందుకు విద్య కొరతే కారణమన్నారు. బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని అలా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇదే సందర్భంగా గత ఏడాది ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను, స్థానిక ప్రముఖులను సత్కరించారు. బీఈఓ నరేంద్రకుమార్, కార్మిక శాఖ అధికారి విజయ, ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనె అధికారి సురేశ్‌గౌడ, శిడ్లఘట్ట టౌన్ ఎస్సై వేణుగోపాల్, జిల్లా మక్కళ రక్షణా సమితి అధ్యక్షుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న న్యాయాధికారి మహ్మద్ రోషన్‌షా

కారుణ్య నియామక పత్రాల అందజేత

బెంగళూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా పెండింగ్‌లో 17మంది అభ్యర్థుల కారుణ్య నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు వ్యవసాయ శాఖ మంత్రి, రాష్ట్ర విత్తనమండలి అధ్యక్షులు ఎన్ చలువరాయస్వామి నియామకపత్రాలు అందజేశారు. విధానసౌధలో గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో నలుగురికి సీనియర్ సహాయకుల పోస్టులు, 5మందికి జూనియర్ సహాయక పోస్టుల, 8మందికి ఓలెకార పోస్టుల ఆదేశపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ శాఖ కార్యదర్శి డాక్టర్ రవిశంకర్, కమిషనర్ వైఎస్ పాటిల్, రాష్ట్ర విత్తనమండలి మేనేజింగ్ డైరెక్టర్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందచేస్తున్న మంత్రి చలువరాయస్వామి

విజేతలకు సన్మానం



బహుమతులు అందజేస్తున్న నటి ఆశికా రంగనాథ్

బెంగళూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గో ఫర్ ఫ్రీడం గోల్డ్ ఆఫర్ 2024 బంపర్ డ్రా విజేతలను ఫ్రీడం హెల్తి కుకింగ్ ఆయిల్ సంస్థ నిర్వాహకులు సత్కరించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కొక్కరికి 50 గ్రాముల బంగారు నాణెం, ఇద్దరు విజేతలకు 10 గ్రాముల బంగారు నాణెం అందచేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలో గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో కన్నడ నటి ఆశికా రంగనాథ్ విచ్చేసి బహుమతులు ప్రదానం చేశారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశ్శా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో వందమంది వినియోగదారులకు ప్రతిరోజూ గ్రాము బంగారం గెలుచుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

దొడ్డగుబ్బి అధ్యక్షురాలిగా మాల మారుతికుమార్



నూతన అధ్యక్షురాలిని సన్మానిస్తున్న ప్రముఖులు

మహదేవపుర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దొడ్డగుబ్బి గ్రామపంచాయతీ నూతన అధ్యక్షురాలిగా మాల మారుతికుమార్ ఎన్నికయ్యారు. చంద్రప్ప రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి బుధవారం ఎన్నికలు జరిగాయి. బీజేపీ మద్దతుదారురాలైన మాల మారుతికుమార్, కాంగ్రెస్ మద్దతుదారుడు లోకేశ్ నామినేషన్ సమర్పించారు. 15మంది సభ్యులకుగానే 9మంది మాల మారుతికుమార్‌కు, నలుగురు లోకేశ్‌కు మద్దతు ఇవ్వగా మరో ఇద్దరు గైర్హాజరైనట్టు ఎన్నికల అధికారి భవిష్యామార్టిన్ తెలిపారు. దీంతో మాల మారుతికుమార్ విజయం సాధించగా బీజేపీ నాయకులు ఆత్మీయంగా సత్కరించారు. నూతన అధ్యక్షురాలు మాట్లాడుతూ మాజీ మంత్రి అరవింద లింబావళి, ప్రస్తుత ఎమ్మెల్యే మంజుళాలు తమ పంచాయతీ అభివృద్ధికి ఎంతో సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో రూరల్ బీజేపీ అధ్యక్షుడు పిళ్ళప్ప, ప్రముఖులు నటరాజ్, రాంపుర గణేశ్, చంద్రప్ప, మారుతికుమార్, మహేశ్, నాగరాజ్, ఉపాధ్యక్షుడు మంజునాథ్, గ్రామ పంచాయతీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకు రాలిన చోట



శిశిర సమీరమో..
జలధి సాన్నిధ్యమో..
ఆకులు రాలి..
మోడువారిన నీ..
కొమ్మ రెమ్మలపై
విహంగాలు పూలై
కాశాయి చూశావా..?
రాలిపోయాయని..
విచారించకు..!
విరబూశాయని
విశ్వసించకు..!
అనుభవం ఏదైనా..
స్వీకరించు..!
ఇక్కడ అంతే..!
ప్రకృతి వింతే..!
(కూడేరు మండలం
శివ రాంపేట ఏటి
గంగమ్మ వద్ద)

- ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాలకు గీత కులస్తులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 5వతేదీతో ముగిసింది. ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఈనెల 8వతేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువును ప్రభుత్వం పొడిగించిందని సూపరింటెండెంట్ తెలిపారు. 10వ తేదీన జడ్పీ ఆడిటోరియంలో లాటరీ తీస్తామన్నారు. జిల్లాలో 14 మద్యం దుకాణాలను గీత కులస్తులకు కేటాయించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు సహస్రకంఠ గాయనం

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రవీంద్ర కళాక్షేత్ర ఆవరణలోని సంస బయలు రంగమందిరంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు సహస్రకంఠ గాయనం కార్యక్రమం నిర్వహించనున్నారు. వచన తర్పీదు దారుడు బండ్లహళ్ళి విజయకుమార్ నేతృత్వంలో 1,122 మంది ఒకేసారి భారీ వేదికపై ఆలపించనున్నారు. వచనగాన వైభవ పేరిట కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోనున్నారు. పన్నెండో శతాబ్దం నుంచి ఇంతవరకు వచనగాయనంలో సహస్రకంఠ గాయనం ద్వారా ఒక రికార్డు సృష్టిస్తూ వస్తున్నారు. ఇందుకు బసవ వేదిక, రమణశ్రీ గ్రూప్ సంస్థలు, అక్కమహాదేవి సమితి, సుమంగలి సేవాశ్రమ, శేషాద్రిపురం కళాశాలలు, బసవ అధ్యయన కేంద్రం సహకారం అందించనున్నట్టు నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి చెరువు ఆక్రమణల తొలగింపు

ముళబాగిలు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో కోలారు జిల్లా అధికారి సూచన మేరకు ఈనెల 7 నుంచి చెరువు ఆక్రమణల తొలగింపు కార్యాచరణ ఉంటుందని తహసీల్దారు గీత ప్రక టనలో తెలిపారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆస్తులను కాపాడడం మనందరి బాధ్యతగా పేర్కొన్నారు. తాను బాధ్య తలు చేపట్టాక ఆక్రమణ తొలగింపులకు సంబంధించి పలు అర్జీలు వచ్చా యని ఆమేరకు ఉన్నతాధికారుల సూచనతో కార్యాచరణ చేపడుతున్నట్టు తెలిపారు. తొలుత దేవరాయసముద్ర గ్రామ పంచాయతీ చెరువుతో ప్రారంభిస్తామని, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

బీజేపీలోకి పలువురి చేరిక

మహదేవపుర, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వర్తూరులో ఏర్పాటైన కార్యక్రమంలో మాజీ మంత్రి అరవింద లింబావళి సమక్షంలో బీజేపీలోకి పలువురు కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా లింబావళి మాట్లాడుతూ ఇతర పార్టీలను వీడి బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. కాగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న పాలనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్యే నియోజకవర్గాలకు సరైన గ్రాంట్లు రావడం లేదన్నారు. గ్యారెంటీ పథకాలకు మినహా అభివృద్ధికి గ్రాంట్ల మంజూరులో తారతమ్య ధోరణి వ్యవహరిస్తోందన్నారు. దీనికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన శాస్తి తప్పదన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి లింబావళి సమక్షంలో బీజేపీలోకి కార్యకర్తలు

క్రికెట్‌లో రాణించిన సునిల్ రమేశ్



సునిల్ రమేశ్

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సర్జాపుర సమీపాన క్రిక్‌బజ్ క్రికెట్ మైదానంలో జరిగిన లీగ్ పోటీల్లో టాస్ గెలిచి జార్ఖండ్ జట్టు బ్యాటింగ్ చేపట్టింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్ నాగేశ్ ట్రోఫీ పురుషుల జాతీయ టి-20 క్రికెట్ పోటీల్లో కర్ణాటక అంధుల జట్టు, జార్ఖండ్ జట్టును ఓడించి సెమిఫైనల్స్‌లోకి అడుగు పెట్టింది. బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 163 రన్‌లు సాధించారు. కర్ణాటక అంధుల జట్టు కూడా అందుకు దీటుగా బదులిచ్చింది. కేవలం 12.3 ఓవర్లలో 164 రన్‌లు సాధించి సెమిఫైనల్స్‌లోకి అడుగు పెట్టారు. కర్ణాటక అంధుల జట్టు బీ3 గ్రూప్‌కు చెందిన సునిల్ రమేశ్ కేవలం 43 బాల్స్‌కు 105 రన్‌లు సాధించడంలో కీలకంగా వ్యవహరించి అందరి అభిమానం సాధించారు.

నరేగాతో గ్రామీణాభివృద్ధిలో విప్లవం

బాగేపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో రూపొందించిన నరేగా పథకం గ్రామీణాభివృద్ధిలో విప్లవం సృష్టించిందని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దేవరగుడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటైన నరేగా దినోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ భారత అభివృద్ధిలో నరేగా కీలకపాత్ర వహించిందన్నారు. పశువులకొట్టం, వ్యవసాయ కుంట, కాలువల నిర్మాణం తదితర వాటికి నరేగా ఎంతో ఉపయోగపడిందన్నారు. నరేగా పథకం ద్వారా ఏ గ్రామాన్ని అభివృద్ధి చేసినా తన గ్రాంటుకింద అదనంగా రూ.25వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈఓ రమేశ్ మాట్లాడుతూ వంద రోజుల ఉపాధి గ్రామీణులకు ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 25 గ్రామపంచాయతీలలో ఉత్తమంగా విధులు నిర్వహించిన అధికారులను ఎమ్మెల్యే ఆత్మీయంగా సత్కరించారు. పీడీఓలు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే సుబ్బారెడ్డికి సన్మానం

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గుట్టకిందపల్లి వద్దగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సురేశ్ బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. 3 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు వారు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలతో ఉదయం 9గంటలకు కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

19 నుంచి టీసీసీ పరీక్షలు

అనంతపురం విద్య/కొత్తచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ-2025) పరీక్షలు ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సులకు సంబంధించిన లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి అభ్యర్థుల హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయనీ, డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

టోల్ బూత్‌ను ఢీకొన్న లారీ

● డ్రైవర్ మృతి.. క్లీనర్‌కు గాయాలు



ధ్వంసమైన టోల్‌ప్లాజాను తొలగిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దానిమ్మ పండ్లతో వెళ్తున్న లారీ టోల్‌బూత్‌ను ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. విజయనగరం జిల్లా మరియమ్మనహళ్ళి జాతీయ రహదారి 50లో బుధవారం రాత్రి తిమ్మలాపూర్ టోల్ ప్లాజా వద్ద దానిమ్మపండ్లతో నిండిన లారీ బొలెరోను వెనుక నుంచి ఢీకొట్టి డివైడర్‌ను ఢీకొట్టింది. లారీ డ్రైవర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని బవనబాగేవాడికి చెందిన ఈరన్న బాగి(37) గా గుర్తించారు. క్లీనర్ శ్రీశైల తీవ్రంగా గాయపడి హొస్పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. అతి వేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో బొలెరో బోల్తాపడిందని అందులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. మరియమ్మనహళ్ళి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

మహా కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

బళ్లారి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా వెళ్లే భక్తులకు కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ(కేఎ్‌ఎఆర్‌టీసీ)నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డివిజినల్ కంట్రోలర్ ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి, విజయనగర, రాయచూరు, కొప్పళ, యాదగిరి, కలబురిగి తదితర కల్యాణ కర్ణాటక జిల్లాల నుంచి బస్సులు నడుపుతామని తెలిపారు. 30 సీట్లు నాన్-ఏసీ స్లీపర్స్ 47 సీట్లు ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. డివిజనల్ పరిధిలో ఆయా కంట్రోలర్ వద్ద ప్యాసింజర్లు పేర్లు నమోదు చేసుకుని రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. లేదా ఎవరైనా బస్సులనే ప్రత్యేకించి అద్దెకు తీసుకున్నా ప్రత్యేక రాయితీ మీద పంపిస్తామన్నారు.

నేడు శనేశ్వర, నిర్మాణానంద స్వామి

జోడు రథోత్సవాలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 6(ఆంధ్ర జ్యోతి): శనేశ్వర, నిర్మాణానంద స్వామి జోడు రథోత్సవాలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు నాగేంద్రస్వామి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిరుగుప్ప తాలుకా పరిధిలోని ముదియనూరు, బలకుంది గ్రామాల మధ్య హగరి నదిలో వెలసిన శనేశ్వరస్వామి, నిర్మాణానంద స్వాముల జోడు రథోత్సవాలను నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్ల ఆశీస్సులు పొందాన్నారు.

దేశ నిర్మాణంలో విద్యార్థులది కీలకపాత్ర : కలెక్టర్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో బలమైన దేశాన్ని నిర్మించడంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమైనదని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. గురువారం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, బళ్లారిలోని జాతీయ సేవాపథకం విభాగం, బెంగళూరులోని ఉన్నతి పౌండేషన్, దార్వాడ్‌లోని సీఐడీఏసీలోని ఉపాధి నైపుణ్య అభివృద్ధి విభాగం సంయుక్తంగా నిర్వహించిన 'మంథన' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ భవిష్యత్తును రూపొందించే శక్తి విద్యార్థుల చేతుల్లోనే ఉందని, విద్యార్థులు స్థిరమైన కృషి, నాణ్యమైన విద్య ద్వారా విజయం సాధించగలన్నారు. ఉన్నత స్థాయి ఉద్యోగం కావాలని కలలు కనే వారు పోటీ పరీక్షలను ఎదుర్కోవడం చాలా ముఖ్యమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి పోటీ పరీక్షలు మూడు దశలల్లో ఉంటాయని, సరైన ప్రణాళికతో అన్నీ విజయం సాధించవచ్చన్నారు. విశ్వవిద్యాలయం వీసీ మురిరాజు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణ, సమయ నిర్వహణను పెంపొందించుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను అధ్యయనం చేయడంతోపాటు వార్తాపత్రికలు చదివే అల వాటును పెంపొందించుకోవాలన్నారు. విశ్వవిద్యాలయం లో అనేక కొత్త కోర్సులు ప్రారంభించామన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, అభివృద్ధి అందించడమే లక్ష్యమన్నారు. రిజిస్ట్రార్ రుద్రేశ్ పరిచయ ప్రసంగం చేశారు. ఈసందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రాణేశ్, జిల్లాపారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ సోమశేఖర్, వివిధ సంస్థల డీన్‌లు, వివిధ విభాగాల అధిపతులు, సమన్వయకర్తలు,ఉపాధ్యాయులు, పరిశోధనా విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

మౌలిక సదుపాయాలు కల్పించండి

● హంపి ఉత్సవాలపై కలెక్టర్‌కు నేతల వినతి



కలెక్టర్ జేఎస్ దివాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రముఖులు

హొస్పేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి జరగనున్న హంపి ఉత్సవాల ఏర్పాట్లు పై గురువారం విజయనగర జిల్లా కలెక్టర్ జే.ఎస్ దివాకర్‌తో స్థానికులు ఎమ్మెల్యే గవియప్ప కుమారుడు హెచ్‌ఆర్‌జీ విరుపాక్షి కలిసి చర్చించారు. ఈ సందర్భంగా వారు హంపి, విరుపాపురం, కమలాపురం, ఇలా హంపీ సమీపంలో ఉండే స్థానికులకు జీవనోపాదికోసం పనులు కల్పించాలని కోరారు. అలాగే హంపీ ఉత్సవాల్లో మౌలిక సదుపాయాలు, విరుపాక్షేశ్వర దేవాలయం వద్ద రస్తా ఏర్పాట్లు తదితర అంశాల పై కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇందుకు కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించారు. స్థానికుల సహకారంతో హంపి ఉత్సవాలు విజయ వంతం చేస్తామని తప్పకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే వాహనాల పార్కింగ్, వివిద ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు నీటి సౌకర్యం తదిత అంశాల పై చర్చించారు.

విషద్రావకం తాగి బాలుడి మృతి..!



శివార్జున్ నాయక్ (ఫైల్)

రాయచూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లకు పెయింటింగ్ వేసే క్రమంలో అందులో వాడే టిన్నర్ ద్రావకాన్ని తాగిన బాలుడు మృత్యువాతపడిన సంఘటన జిల్లాలోని మాన్వి తాలూకా హిరేకొట్నెకల్‌లో చోటు చేసుకుంది. పెయింటింగ్‌లో కలిపేందుకు ఉంచిన ద్రావకాన్ని మూడేళ్ల బాలుడు శివార్జున్ నాయక్ అమాయకంగా తాగాడు. అస్వస్థతకు గురైన బాలుడిని తల్లిదండ్రులు స్థానికంగా మాన్విలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృత్యువాతపడ్డాడు. దీంతో తల్లిదండ్రుల్లో శోకసంద్రంలో మునిగిపోగా, గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

ఆర్టీసీ బస్సు బోల్తా

రాయచూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళతున్న ఆర్టీసీ బస్సుకు ఎక్సెల్ విరగడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన గురువారం జిల్లాలోని లింగసుగూరు తాలూకా ముదగల్ పట్టణ సమీపం వద్ద చోటు చేసుకుంది. బస్సు ప్రమాదానికి గురైన సమయంలో 33 మంది స్త్రీలు, 6 మంది పురుషులతో పాటు 30 మంది విద్యార్థులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో కొంత మంది ప్రయాణీకులకు గాయాలు కాగా వారిని చికిత్స కోసం తాలూకా ఆస్పత్రికి తరలించారు.

తరగది లేదు..!

● గదులు లేక చెట్ల నీడలోనే చదువులు

బళ్లారిరూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను అభివృద్ధి చేస్తాం..విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం అని పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నా విద్యార్థులకు సౌకర్యాలు కరువయ్యాయనే చెప్పవచ్చు. బళ్లారి రూరల్ పరిధిలోని కొత్త ఎర్రగుడి గ్రామంలో ప్రాథమిక విద్యార్థుల చదువులు చెట్ల నీడల్లోనే కొనసాగుతున్నాయి. గ్రామంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉండగా, దాదాపు 147 మంది విద్యార్థులు ఉన్నారు. మూడు గదులే పాఠశాలతో ఉన్నాయి. ఒక రూమును ప్రధానోపాధ్యాయుడికి, మరో రూమును స్టాఫ్ రూముగా, ఇంకొక రూమును వంటగదిగా చేసుకోవడంతో విద్యార్థులకు గది లేకుండా పోయింది. దీంతో విద్యార్థుల విద్యాచదువులు చెట్ల నీడల్లోనే కొనసాగుతున్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించి అదనపు గదులు నిర్మించాలని గ్రామ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



స్టోర్ రూంగా మారిన ఓ గది



చెట్ల నీడలోనే పాఠాలు వింటున్న విద్యార్థులు



మాట్లాడుతున్న విజయనగరం జిల్లా కలెక్టర్ దివాకర్

రుణ గ్రహీతలను వేధిస్తే క్రిమినల్ కేసులు

● మైక్రో ఫైనాన్స్ సంస్థలకు కలెక్టర్ హెచ్చరిక

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రుణగ్రహీతల ఇళ్ల ముందు రాతల ద్వారా రుణ బకాయిలు రాయడం, వారిని మానసికంగా వేధించడం, అసభ్యకరమైన పదాలు ఉపయోగించ డం, దూషించడం వంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవని జిల్లాకలెక్టర్ ఎం.ఎస్. దివాకర్ మైక్రో ఫైనాన్స్ సంస్థలను కేటాయించారు. గురువారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయ హాల్లో మైక్రోఫైనాన్స్, ఆర్థిక సంస్థల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ జిల్లాలో 105 మైక్రోఫైనాన్స్ సంస్థలు ఉన్నాయన్నారు. ఆర్‌బీఐ ఆదేశం ప్రకారం అత్యవసర పరిస్థితుల్లో మైక్రోఫైనాన్స్ సంస్థల నుండి డబ్బు పొందిన రుణగ్రహీతలకు మనీలాండరింగ్ సంస్థలు అదనపు వడ్డీని వసూలు చేయకూడదన్నారు. సెక్యూర్డ్ రుణాలకు గరిష్ట వార్షిక వడ్డీరేటు 14శాతం, అన్‌సెక్యూర్డ్ రుణాలకు 16శాతం తప్పనిసరి, అధిక వడ్డీరేట్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. రుణం మంజూరు చేసే ముందు నిబంధనలను రుణగ్రహీతలకు తెలియజేయాలన్నారు. సేకరణకు వెళ్లే వ్యక్తి అధికారిక సమాచారంతో కూడిన గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. కొట్టూరులో వేధింపులతో విసిగిపోయి ఆత్మహత్యాయత్నం చేసిన ఒక మహిళలను తీవ్రంగా పరిగణించి నిబంధనల ప్రకారం అరెస్టు చేశారు. అటువంటి సందర్భాల్లో శిక్షలు జరిమానాల పద్దతులను సమావేశంలో వివరించారు. పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణప్ప, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీహరిబాబు, అదనపు పోలీసు సూపరింటెండెంట్ సలీంపాషా, లీడ్ బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణప్ప వివిధ మైక్రోఫైనాన్స్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సీకి నీరు వదలాలి: ఏఐకేకేఎంఎస్



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలో ఏఐకేకేఎంఎస్ సభ్యులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎల్‌సీకి మరో 20రోజులు నీరు వదలాలని గురువారం ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం, కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరు సేన సంయుక్తంగా జిల్లాకలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హసిరు సేన జిల్లాధ్యక్షుడు సంగనకల్లు కృష్ణప్ప, ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం జిల్లాధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు జొన్న, మొక్కజొన్న,సజ్జలు , అలసందలు,మిరప తదితర ఇతర పంటలు అధికంగా సాగు చేస్తున్నా రన్నారు. పంట చేతికి రావడానికి సుమారు 20రోజులు నీరు కావాల్సివస్తుందన్నారు. నాయకులు, అధికారులు రైతుల సంక్షేమం దృష్ట్యా నీటిని వదలాలన్నారు. ఏడీసీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐకేకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గురళ్ళి రాజ, రైతులైన ఈశ్వర్ గౌడ, బసవరాజ్, గాదిలింగ, ఓంకార, స్వామి, బసవరాజ్, తుళసప్ప పాల్గొన్నారు.

ఆ రెండు మద్యం దుకాణాలను తొలగించండి

● అంబేడ్కర్ స్వాభిమాన సేన డిమాండ్



చెన్నప్ప, సేన అధ్యక్షుడు

కంప్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న రెండు మద్యపాన దుకాణాలను తొలగించాలని అంబేడ్కర్ స్వాభిమాన సేన తాలుకా అధ్యక్షుడు చెన్నప్ప డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఈ రెండు దుకాణాల్లు విద్యార్థులకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయన్నారు. ఈ విషయంపైన ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ రెండు బస్టాండ్‌కు సమీపాన ఉన్నందువల్ల తాగుబోతులు తరచూ విద్యార్థులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

చెరువుల అభివృద్ధికి రూ.4.75 కోట్లు



స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 6 (ఆంధ్ర జ్యోతి): చెరువుల అభివృద్ధికి రూ.4.75 కోట్లు నిధులు కేటాయించినట్లు పంచాయతీ రాజ్ శాఖ ఏఈఈ తిప్పే స్వామి తెలిపారు. గురువారం సిరుగుప్ప తాలుకా పరిధిలో శిరిగేరి ప్రాంతాలలో చెరువుల నిర్మాణ పనుల కోసం స్థలాలను ఆయన పరిశీలించారు. గ్రామ పరిధిలో చెరువు పక్కన డ్రైనేజీ నీరు మళ్లించేందుకు ఆ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం తాలుకా పరిధిలో చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ కాంతరాజు, శ్రీనివాస, రేవణసిద్దప్ప, శిరిగేరి ప్రాంతంలో చెరువుల నిర్మాణ పనుల కోసం పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు స్థలాలను పరిశీలించారు.

దమ్మూరు గ్రామ పంచాయతీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యక్షుడు దేవన్న

కంప్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకా పరిధిలోని దమ్మూరు గ్రామ పంచాయతీ ఉత్తమ ఉపాధి హామీ పథకం అవార్డును అందుకుంది. బుధవారం బెంగళూరులో గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో గుల్బర్గా విభాగం జిల్లా స్థాయి ప్రథమస్థాయి దక్కించుకుని, స్పీకర్ బసవరాజు వరట్టి, మంత్రులు ప్రియాంక ఖర్గే చేతుల మీదుగా అవార్డును గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీ, ఉపాధ్యక్షులు దేవన్న కార్యదర్శి మల్లికార్జున అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీ, ఉపాధ్యక్షులు దేవన్న మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు, గ్రామ పంచాయతీ సభ్యులు ఉపాధి కూలీలు సహకారంతోనే తమకు ఈ అవార్డు దక్కిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

నార్పల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్ డేవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీవీ ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఫెల్‌ఫైనాన్స్, యంగ్ ఇండియా తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన ప్రతి ఒక్కరూ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9010039901 సంప్రదించాలన్నారు.

హోసూరు జోన్

కేంద్ర బడ్జెట్‌పై నిరసన



బడ్జెట్ ప్రతిని చింపి నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ కార్యకర్తలు

హోసూరు ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆల్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫిడరేషన్ ఆధ్వర్యంలో హోసూరు రాంనగర్ అన్నా విగ్రహం వద్ద కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి గోకాలకృష్ణన్, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేదలు, కార్మికుల బడ్జెట్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాదయ్యన్, ఎల్పీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి కృష్ణన్, శ్రీధర్, వాసుదేవన్, కృష్ణమూర్తి జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు శంకరయ్య, సెందిల్, మూర్తి, భక్తవత్సలం, శ్రీధరన్, చిన్నస్వామి పాల్గొన్నారు.

గోతిలో పడిన పాఠశాల బస్సు

కంప్లి, ఫిబ్రవరి 6(ఆంధ్ర జ్యోతి): విజయనగర జిల్లాలో హరప్పనహళ్లి బంద్రి సమీపాన గురువారం ఉదయం ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి గుంతలో పడింది. రాశి ఎడ్యుకేషన్ ట్రస్టు బస్సు యల్లాపురం చాణుక్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల వద్ద వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న కారుకు సైడు ఇవ్వబోయి బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే వున్న గుంతలో పడింది. డ్రైవర్ వేగవంతమే కారణమని తెలిపారు. స్వల్ప గాయాలతో విద్యార్థులు బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గోతిలో పడ్డ బస్సు





ఎద్దుల పండుగకు హాజరైన ప్రజలు

ఆకట్టుకున్న ఎద్దుల జాతర

హోసూరు ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపం యా.కొత్తపల్లిలో గురువారం నిర్వహించిన ఎద్దుల జాతర ఆకట్టుకుంది. జాతరను తిలకించేందుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. శూలగిరి, కెలమంగలం, డెంకణీకోట, రాయకోటతో పాటు పలు ప్రాంతాల నుంచి ఎద్దులను తీసుకువచ్చారు. అలంకరించిన ఎద్దులకు పోటీలు నిర్వహించారు. పోటీలను వచ్చిన ప్రజలు తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

హోసూరు ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలో ఉన్న బేరికై ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లోనూ వార్షికోత్సవాలు జరుపుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు గురువారం పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వై. ప్రకాశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో నగర కార్యదర్శి, మేయర్ సత్య, యూనియన్ కార్యదర్శి నాగేశ్, నిర్వాహకులు కృష్ణన్, మునికృష్ణన్, మణికంటన్, ప్రధాన ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.